**HIJAB (Burqa)**

# హిజాబ్

## (బురఖా)

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ (Regd.)**
సందేశభవనం, లక్కడ్‌కోట్, ఛత్తాబజార్,
హైదరాబాద్-2. ఫోన్:040-24564583

# HIJAB (Burqa) (Telugu)

***Source : Muslim Mahilala Hakkulu***

**TIP Series No. : 351**

*All Rights Reserved with Publishers*

1st Edition : September 2023

Copies : 1000

**Price : Rs.30**

Published by : **Telugu Islamic Publications Trust (Regd.)**
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phones: **9490627650**
24576237, 24564583
e-mail: geeturaiweekly@gmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

# హిజాబ్

# (బురఖా)

## హిజాబ్ ఆదేశాలు

స్త్రీ హిజాబ్ లేదా పరదాకు సంబంధించిన ఆదేశాలు దివ్యకుర్‌ఆన్‌లో విభిన్న చోట్ల వివరించబడ్డాయి. ప్రతిచోటా పూర్వాపరాలు వేరయినా వాటి భావం, ఉద్దేశం, ఆవశ్యకత రీత్యా అవి అతి స్పష్టంగానే ఉన్నాయి. ఆ ఆదేశాల ద్వారా ఇస్లామ్ నైజాన్ని, దాని మొగ్గుదల, అది కోరేదేమిటో కూడా అతి సునాయాసంగా తెలుసు కోవచ్చు.

## అపరిచితులతో సంభాషణా మర్యాదలు

దైవసందేశహరుల (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) సతీమణులు ముస్లిమ్ సముదాయానికి మాతృమూర్తులు. (అల్ అహ్జాబ్ : 6). వారి జీవితం, సముదాయానికి ఆదర్శం. వారిని సంబోధించి ఇలా సెలవీయబడింది దివ్య కుర్‌ఆన్‌లో...

> **ప్రవక్త సతీమణులారా, మీరు సాధారణ స్త్రీల వంటివారు కారు. మీరు దైవానికి భయపడే వారే అయినట్లయితే తగ్గు స్వరంలో మాటలాడ కండి, మనో చాపల్యం గల వ్యక్తి ఎవడయినా దురాశకు లోనవగలడు, అలా కాక స్పష్టంగా, ఖరాఖండిగా మాటలాడండి. (అల్ అహ్జాబ్ : 32)**

ఈ ఆయత్‌లో పవిత్ర సతీమణుల్ని సంబోధించి అపరిచిత పురుషులతో సంభాషించే విధానం తెలుపడం జరిగింది. ఈ సందర్భంలో రెండు నిర్దేశాలివ్వ బడ్డాయి. ఒకటి, ఎవరితోనయినా మాటలాడవలసి వస్తే మాట తీరులో ఆకర్షణ, ధ్వనిలో లాలిత్యం ఉండరాదని దానికి బదులుగా ఓ విధంగా కాఠిన్యం

ఉండాలని చెప్పడం జరిగింది, లేకపోతే ఎవడయినా దుష్ట మనస్కుడి ఆంతర్యంలో దురభిప్రాయాలు చోటుచేసుకోవచ్చు. రెండవ నిర్దేశన, ఏ మాట అయినా ప్రసిద్ధ సత్కార్యం, సదాచారం, మంచికి సంబంధించినదే కాగలగాలి. చెడు విషయం, అశుద్ధం, అనుచితమయినది కారాదు.

## గృహ సీమే కార్యరంగం

ఆ వెంటనే ఇలా సెలవీయబడింది : మీ గృహాలలో నిలకడతో గడపండి. మును పటి అజ్ఞాన కాలపు సింగారం చూపించుకుంటూ తిరగకండి. నమాజ్‌ని స్థాపిం చండి, జకాత్‌నివ్వండి, అల్లాహ్‌కు, ఆయన సందేశ హరునికి విధేయత పాటిం చండి. ప్రవక్త గృహస్థులయిన మీ నుండి మాలిన్యాన్ని దూరం చెయ్యాలని, మిమ్మల్ని సంపూర్ణంగా పరిశుద్ధపరచాలనీ అల్లాహ్ కోరుకుంటున్నాడు. (అల్ అహ్జాబ్ : 33)

ఈ ఆయత్‌లో పవిత్ర సతీమణుల్ని ఇంట ప్రశాంతంగా గడపాలని ఆదేశించడం జరిగింది (ఇందులో అవసరం మేరకు ఇంటి నుండి బయటకు వెళ్ళరాదని వారించబడిలేదు). అజ్ఞాన కాలపు అశ్లీల సంస్కృతి దాని అశుద్ధ విధానాల నుండి తప్పించుకుని మెలగాలి. నమాజ్ స్థాపించడం, జకాత్‌నివ్వడంతోపాటు జీవన వ్యవహారాలన్నింటిలో దైవం, దైవ సందేశహరుల విధేయతను పాటించాలని, దాని వివేచన, విజ్ఞత కూడా తెలుపడం జరిగింది. అదేమిటంటే, పరమ ప్రభువు అల్లాహ్ తన సందేశహరుని ఇంటివారల జీవితాలు నైతిక అశుద్ధతల నుండి దూరంగా ఉండాలని, శీల స్వభావాల అత్యున్నత స్థానాన ఉండాలని కోరుకుంటు న్నాడు. ఇది కేవలం పవిత్ర సతీమణులకే నిర్దేశన కాదు, సమస్త సముదాయా నికీ ఇది, సముదాయంలో అందరి వ్యక్తిగత జీవితం, వారి సామాజిక జీవితం ఏ విధంగా, ఏ పరిమితులకు లోబడి ఉండాలో తెలిపే మార్గనిర్దేశన. పవిత్ర సతీమణులు సమస్త సముదాయానికి ఆదర్శమూర్తులు గనక, వారి ఆదర్శాన్ని సముదాయం అనుసరిస్తుంది గనక వారికి ఇచ్చిన నిర్దేశనలు సముదాయం అంతటికీ వర్తిస్తాయి.

## వస్తువులు ఇచ్చిపుచ్చుకునే విధానం

ఇవి అహ్జాబ్ సూరా ఆయత్‌లు. ఇదే సూరాలో కాస్త ముందుకు సాగిన తరువాత విశ్వసించిన వారికి ఇలా నిర్దేశించడం జరిగింది :

**ప్రవక్త సతీమణుల వద్ద మీరు ఏమయినా అడగదలిస్తే తెరచాటుగా అడిగి తీసుకోండి, ఇది మీకూ వారి ఆంతర్యాల పవిత్రతకూ ఇతోధికంగా సముచితమయిన పద్ధతి. (33. అల్ అహ్జాబ్ : 53)**

ఈ ఆయత్‌లోనూ పైన పేర్కొన్న ఆయత్‌లోనూ 'హిజాబ్' లేదా 'పరదా'కు సంబంధించిన ఆదేశంలో గల వివేచనా విజ్ఞతలు వివరించబడ్డాయి. ఈ ఆదేశాలు ఎంతగా విశ్వాసుల మాతృమూర్తులకు సంబంధించినవో అంతగానే సముదాయం లోని ఇతర మహిళలకూ వర్తిస్తాయి. వీటివల్ల ముస్లిమ్ స్త్రీ పురుషులు ఇరువురి ఆంతర్యాలూ మురికి భావాలు, మలిన ఊహలు అపరిశుద్ధ భావోద్రేకాల నుండి సురక్షితంగా ఉంటాయి.

## ఇంటి బయట ముసుగు (జిల్బాబ్) ధరించాలి

అహ్జాబ్ సూరాలోనే పవిత్ర సతీమణులు, పరిశుద్ధ కుమార్తెలతోపాటు సామాన్య విశ్వాసుల మహిళలందరి కొరకు ఇంటి బయటికి వెళ్ళే మర్యాదలు వివరించబడ్డాయి:

**ప్రవక్తా, నీ భార్యలకు, కూతుళ్ళకు, విశ్వసించిన వారి మహిళలకు చెప్పివెయ్యి, తమపైన తమ దుప్పట్ల కొంగులు వ్రేలాడదీసుకోవాలని. ఇది చాలా సముచితమయిన పద్ధతి, వారిని గుర్తించగలగటానికి, వారిని వేధించకుండా ఉండటానికి. పరమ ప్రభువు అల్లాహ్ క్షమాశీలుడు, కరుణామయుడు. (అహ్జాబ్ : 59)**

ఈ ఆయత్‌లో ఇంటి బయటికి వెళ్ళినప్పుడు జిల్బాబ్‌ని వినియోగించే ఆదేశముంది. జిల్బాబ్ అన్నది శరీరం మొత్తాన్ని కప్పుకునే పెద్ద దుప్పటిని అంటారు. దాన్ని ఉపయోగించడం వల్ల వారు సౌజన్యశీలురయిన, నీతిమంతు లయిన, పరిశుద్ధ స్వభావులయిన మహిళలుగా గుర్తింపబడతారు. దుష్టుడెవరూ వారిని దుర్బుద్ధితో పలకరించడానికీ, చెయ్యి చేసుకోవడానికి సాహసించలేడు.

## క్రింది చూపు

నూర్ సూరాలోనూ పరదాకు సంబంధించిన ఆదేశాలున్నాయి. వాటి ప్రారంభం, 'క్రిందిచూపు' (గజ్జబసర్) ఆదేశంతో జరిగింది. గజ్జబసర్ లేదా క్రిందిచూపు అంటే ఉద్దేశం, చూపును క్రిందికి వాల్చి ఉంచడం అన్నది, పరస్త్రీ పురుషుల మీద దృష్టి సారించరాదన్నది. ఆదేశం ఇది :

**ప్రవక్తా, విశ్వాసులయిన పురుషులకు చెప్పు, తమ చూపులను కాపాడుకుని మెలగాలని, తమ మర్మాంగాలను పరిరక్షించుకోవాలనీను. ఇదే వారికి ఎంతో పవిత్రమయిన పద్ధతి, వారు చేసేదేమయినా దాన్ని గురించి అల్లాహ్ ఎలాగూ తెలుసుకుంటాడు.** ***(24 అన్‌నూర్: 30)***

చూపు పలువిధాల పరిభ్రమించబడటమంటే అది వ్యభిచారం, దుశ్చేష్టల వైపునకు గొనిపోయే తొలి అడుగు అన్నమాట. క్రిందిచూపు దుశ్చేష్ట నుండి తప్పించుకునేందుకు గొప్ప మార్గం. దీనివల్ల తక్వా, పరిశుద్ధత, సదాచారాల మార్గం సుగమమవుతుంది. ఈ కారణంగానే క్రింది చూపు ఆదేశంతోపాటే, సిగ్గు పట్టును కాపాడుకునే ఆదేశం కూడా ఇవ్వడం జరిగింది. ఎందుకంటే ఈ రెంటి మధ్య చాలా గట్టి సంబంధమే ఉంది.

క్రిందిచూపు ఆదేశం స్త్రీ పురుషులు ఇరువురికీ ఇవ్వడం జరిగింది. కాగా పురుషుల తరువాత స్త్రీలకు ఆదేశమయింది; దీనితోపాటే స్త్రీలు తమ అలంకరణల్ని, శోభనూ తమ ఆప్తులకు తప్ప మరెవరి ముందూ ప్రదర్శించరాదని ఆదేశమయింది:

**ప్రవక్తా, విశ్వసించిన మహిళలకూ చెప్పు, తమ చూపులను తప్పించుకు మెలగాలని. తమ మర్మస్థలాలనూ పరిరక్షించుకోవాలని, ఇంకా తమ సింగారాలను ప్రదర్శించరాదని ఏదో దానంతట అదే వ్యక్తమయ్యే దాన్ని తప్ప; తమ రొమ్ములపైన తమ పైట కొంగులు కప్పుకోవా లనీను. వారు తమ అలంకరణలను వీరి సమక్షంలో తప్ప ఎక్కడా వ్యక్తపరచరాదు; భర్తలు...** ***(24 అన్ నూర్ : 31)***

## నిషిద్ధ వ్యక్తులను గురించి...

దీని తరువాత స్త్రీ తన అలంకరణల్ని ప్రదర్శించగల వ్యక్తుల ప్రస్తావన ఉంది. వారిలో క్రింది ఏడుగురు దగ్గరి బంధువులున్నారు:

తండ్రి, భర్త తండ్రి (మామ), స్వంత కొడుకులు, సవతి కొడుకులు, సోదరులు, సోదరీ సోదరుల కొడుకులు, భర్త సోదరీ సోదరుల కొడుకులు. వీరు స్త్రీకి నిషిద్ధ బంధువులు. వీరితో ఎట్టి పరిస్థితిలోనూ ఆమె పెళ్ళి జరగజాలదు. వీరిలోనే

బాబాయి, పెదనాన్న, మామయ్య (తల్లి సోదరులు) కూడా చేరి ఉన్నారు. అలాగే పాలు పట్టడం వల్ల ఏర్పడ్డ బంధుగణం కూడా. వీరంతా నిషిద్ధ బంధువులు.

ఈ ఆయత్‌లో వీరితోపాటు దిగువన పేర్కొన్న వ్యక్తుల సమక్షంలోనూ అలంకరణల్ని, శోభనూ వ్యక్తం చెయ్యగల అనుమతి ఉంది. ఇంటిలోని, కుటుంబం లోని, ఇరుగు పొరుగులోని, ఇంకా కలసిమెలసి ఉండే మహిళలు. అయితే వీరంతా ధార్మికంగానూ నైతికంగానూ వీరు నిసాయిహిన్న (తమ మహిళలు) అనబడగల మహిళలయి ఉండాలి. పనికత్తెలు, స్త్రీల పట్ల ఎటువంటి ఆసక్తి మిగులని నౌకరులు, పిన్న వయసు గల బాలురు కూడా ఈ జాబితాలోకి చేరిన వారే.

భార్యాభర్తల మధ్య లైంగిక సంబంధముంటుంది. వీరి మధ్య 'పరదా'కు సంబంధించిన ఆదేశం, ఇతరులకు వర్తించేది వీరికి వర్తించదు. వీరు పరస్పరం తమ పూర్తి శరీరాలతోనే లైంగిక ఆనందాన్ని పొందగలరు. పైన పేర్కొన్న నిషిద్ధ బంధువులలో, వారి వయసు, సంబంధాల రీత్యా స్త్రీ తన అలంకరణల్ని, శోభను, ఎట్టి అరమరికల్లేకుండా వ్యక్తపరిచే అనుమతి ఉంటుంది.

## నడిచే, నడయాడే మర్యాద

ఆయత్ చివరలో స్త్రీకి నడిచే, తిరిగే సందర్భంలోనూ తన అలంకరణను వ్యక్తం చెయ్యరాదని నిర్దేశించడం జరిగింది:

> **ఇంకా వారు తమ కాళ్ళను నేలకేసి కొడుతూ నడవరాదు– తాము మరుగుపరచిన ఆభరణ భూషణలేవో జనులకు తెలిసిపోయేలా. విశ్వాసులారా, మీరంతా కలిసి అల్లాహ్ సమక్షంలో తౌబా చేయండి, ఇలా మీరు సాఫల్యం పొందగలరన్న నమ్మకముంది. (అన్ నూర్: 30)**

## ఆధునిక కాలానికి 'పరదా' స్వీకార యోగ్యం కాదు!

ఆధునిక కాలానికి పరదాకు సంబంధించిన ఈ బోధనలు ప్రాచీన కాలపు స్మరణలు, నేడు స్వీకారయోగ్యం కావు. ఈ కాలం వీటిని స్త్రీ స్వేచ్ఛకు వ్యతిరేకమే కాదు ఆమె అభ్యుదయానికి అవరోధంగా భావిస్తోంది. నేడు పరిస్థితులు ఎంతగానో మారిపోయాయి. కొత్త ఆవశ్యకతలు ముందుకు వచ్చాయి. స్త్రీ పాత

ప్రతిబంధకాల నుండి విముక్తి పొందనంతవరకు కొత్త పోకడల ఆవశ్యకతలకు తోడ్పాటునివ్వజాలదు, ప్రగతినీ సాధించజాలదు.

## స్త్రీలో తెర చీల్చివేసే తత్వం సృజించడం!

ఆధునిక సభ్యతా సంస్కృతుల ప్రత్యేకతల్లో ఒకటి ఏమిటంటే, అది స్త్రీలో లజ్జా విహీనత, అశ్లీలత పట్ల మొగ్గుదల సృజించింది. ఈ ప్రవృత్తి ఎంత బలంగా పెరగసాగిందో స్త్రీలో అశ్లీలత సయితం అంతే అధికమవసాగింది. స్త్రీలో అశ్లీలత వల్ల పురుషునికి లైంగిక ఆనందం ప్రాప్తమవుతుంది, అందువల్ల పురుషుడు దానికి అభ్యంతరమూ చెప్పలేదు, దానిమీద ఆంక్షలూ విధించలేదు, నిజానికి దాని వృద్ధినే కాంక్షించాడు! పైగా అతను స్త్రీ ఆంతర్యంలో తన అందచందాలు మరింతగా బహిర్గతపరిచేందుకు ఆశలు, పేరాశలు పెంచసాగాడు. తెరచాటున దాచిపెట్టడం ఆమె వ్యక్తిత్వానికి ఎనలేని అవమానమన్న భావన ఆమె మనసులో నాటి వేశాడు, ఇంకా ఎదుటి వ్యక్తితో తనను దాచిపెట్టడం పూర్తిగా అసహజ మయింది, ప్రకృతికి విరుద్ధమయింది, ఆమె వస్త్రధారణ, ఆమె అంగాంగాల వైభవాలు గుప్తపరచడానికి కాదు, వాటిని ద్విగుణీకృతం చెయ్యడానికి దోహద పడాలి, ఎదుటి వ్యక్తి ఆకర్షితుడయి వాంఛా వివశుడయి తన వైపునకు వ్రాలి పోవాలి; ఏ వస్త్రధారణలో ఈ మనోహర శక్తి భాసిల్లదో అది లలనామణి సున్నిత లతాంగాన శోభిల్లజాలదు అన్న భావన ఆమెలో పాదుకునేలా చేయడం జరిగింది. ఫలితంగా మహిళామణి దుస్తుల్లో కత్తి రింపుల పర్వం ప్రారంభ మయింది, ఆమె ఒడలులోని ఒంపు సొంపులన్నీ ప్రదర్శిత మయ్యే వస్త్రధారణ వచ్చేసింది. కడకు ఓ కాలంలో ఎవరి సమక్షంలోనూ బయల్ప డటం ఎంతో అసహ్యకరంగా భావించబడేదో అవన్నీ ప్రదర్శనా భాగ్యానికి నోచుకున్నాయి; ఇక శరీరం మీద కేవలం కొన్ని పేలికలు, ఎంతో అయిష్టంగానే మిగిలిపోయాయి, అవి కూడా ఎప్పుడు రాలిపోతాయో మరి! బహుశా ఈ లలితాంగి ఈ భారాన్నీ మరెంతో కాలం మోయనేరదేమో, పూర్ణ నగ్నత్వ ప్రచార హేళి ఎప్పుడో మొదలయింది!! దీనికీ ఆధారాల అన్వేషణ, పరిశోధన జరుగుతోంది. దీన్నే సరిగ్గా మానవ ప్రకృతిగా ఘోషించడం జరుగుతోంది. అన్నింటికన్నా ముఖ్యమయిన విషయం ఏమిటంటే స్త్రీ ఆ దారిలో ముందడుగు వేసింది- మానవ ప్రకృతి పట్ల ఇంతకన్నా హీనంగా పరాభవపూర్వకమయిన ప్రవర్తన మునుపెన్నడయినా జరిగి ఉంటుందా?

## పురుషుని దుస్తులు మరింత ఆచ్ఛాదనీయంగా...

నేటి కాలంలో నగ్నత్వం ఓ కళగా, ఆర్ట్‌గా రూపొందింది. దీనికనుకూలంగా వాతావరణమే సృజించడం జరిగింది. ఇక స్త్రీ ఆనందానికి హద్దే మిగల్లేదు. స్త్రీకి సిగ్గే సింగారమంటారు, ఆ సింగారాన్నీ వదిలేసి ఎటువంటి సిగ్గూ ఎగ్గూ లేకుండా అర్ధనగ్నంగా ఎల్లెడలా నడయాడసాగింది. కాని విచిత్రమేమిటంటే పురుషుడు ఈ కళను స్వీకరించలేదు. అతని దుస్తుల్లో స్త్రీ వంటి నగ్నత చోటు చేసుకోలేదు, పైపెచ్చు నాగరికత పెరిగిన కొద్దీ అతని దుస్తుల్లో ఆచ్ఛాదనీయత సయితం మరింతగా పెరుగుతూనే పోయింది. అతను స్వయంగానయితే రుతువుల కనుగుణంగా వస్త్రధారణను అనుసరించేవాడు, కాని పాపం స్త్రీకి మాత్రం కాటు వేసే అత్యంత జఠిల శీతల కాలంలోనూ పూర్తిగా శరీరాన్ని కూడా కప్పుకునే అనుమతినిచ్చేందుకు సిద్ధంగా లేడు! పురుషుడు స్వయంగా తనకయితే వస్త్రాలు వదులుగా అనుకూలంగా సుఖవంతంగా ప్రతిపాదించుకుంటాడు, కాని స్త్రీ కొరకు ఎంతగా బిగుతయినవి, బాధాకరమయినవి ప్రతిపాదిస్తాడంటే ఆమె అంగాంగం కొలతలతో సహా బయల్పడగలగాలి, ఆమెకు సుఖము, అనుకూలతా ప్రాప్తం కారాదు, బాగా దళసరిగా ఉన్న బట్ట వాడటం తనకు తప్పుకాదని భావిస్తాడు, కాని స్త్రీకి ఎంతగా సన్నని, పలుచని బట్టలు వాడజేస్తాడంటే లోని శరీర భాగాలన్నీ మసక మసకగా కనిపిస్తూనే ఉంటాయి. పురుషుని వైఖరిలోని వింతయిన వైరుధ్యం ఇది. అయినా స్త్రీ ఈ వైరుధ్యాన్ని ఇంకా గుర్తించకపోవడం ఆశ్చర్యకరం. నిజానికి పురుషుడు తల నుండి కాలి వరకు అనేకానేక వస్త్రాలను ధరించి స్త్రీలను అర్ధనగ్నంగా వెంటబెట్టుకుని నడుస్తున్నప్పుడే అతని ఈ వైఖరి పట్ల స్త్రీ నిరసన కాదు, తిరుగుబాటు చెయ్యవలసింది. కాని స్త్రీ తన అవివేకం చేత ఈ వైఖరిని నాగరికత, సంస్కృతీ ఆవశ్యకతగా భావించి కూర్చున్నది. తన శరీర ప్రదర్శన పట్ల ఆమెలో పరాభవ భావనతో ఆమె శిరస్సు వ్రాలిపోవలసింది పోయి గర్వంతోనూ పొగరుతోనూ ఇంకా పైకే ఎగురుతుంది, ఆమె ఇంకా ఎంతో లాలన తోనూ, వయ్యారంతోనూ పురుషునితో ఏకీభవిస్తూ కానవస్తుంది!

నగ్నత్వపు ఈ వాతావరణంలో ఏ స్త్రీ అయినా ఇస్లామీయ పరిమితుల్ని పాటిస్తూ, తన శరీరాన్ని పరదృష్టితో కాపాడుకున్నట్లయితే మోహాతురుడయిన పురుషుని రక్తం ఉడకనారంభిస్తుంది. అతనికి ఆవిడ, సంచరించే మృత కళేబరంగా

కనిపిస్తుంది. ఆ కళేబరం వల్ల అతని ఆవేశకావేశాలకు తృప్తి ప్రాప్తం అవదు. అతను ఆ వేటలోనే చుట్టూ దృష్టి సారిస్తూ తిరుగుతూ ఉంటాడు.

ఇక ఏ ఆధారాల ద్వారా 'పరదా' విధానాన్ని వ్యతిరేకించడం జరుగుతుందో వాటిని పరిశీలిద్దాము.

## 'హిజాబ్' లేదా 'పరదా' సహజ భావోద్రేకాలపైన ప్రతిబంధకమా?

ఒక వాదన ఏమిటంటే స్త్రీ పురుషుల మధ్య పరదా లేదా హిజాబ్ విధానం వల్ల వారి లైంగిక భావోద్రేకాలు లోలోనే కృశించిపోతుంటాయి, వారు అతి తీవ్ర మానసిక చిక్కులకు లోనవుతారు. హిజాబ్ మానవుల సహజ వాంఛపైన అనవసర మయిన ప్రతిబంధకం. సహజ భావోద్రేకాలపైన ప్రతిబంధకం విధించి నప్పుడు అవకాశం ప్రాప్తం కాగానే అవి అతి తీవ్రంగా ముందుకు వచ్చి అతి భయంకరంగా ప్రతిఫలిస్తాయి. అయితే ఇందులో ఇప్పుడు ఏమాత్రం పసలేదని తేలిపోయింది. ఇంకా ఇది నిజం కాదని, ఈ పునాది లేని తత్వం మానవ మానసిక స్థితిగతులకు పూర్తిగా భిన్నమయినదని అర్థమయిపోయింది. అనుభవాలు దీన్ని నిత్యం ఖండిస్తూ వచ్చాయి. స్వయాన పశ్చిమ దేశాల అనుభవాలు, పరదా లేని స్త్రీ పురుషుల మిశ్రమ సమావేశాల వల్ల లైంగిక భావోద్రేకాలు మరింతగా పెట్రేగిపోతాయని, వ్యభిచారం, లైంగిక విశృంఖలత్వం, ఇంకా దుర్నీతి చేష్టలు సర్వసామాన్యమయిపోతాయని రుజువయిపోయింది. కాగా నేడు విశృంఖల లైంగిక సంబంధాలు పాశ్చాత్య సమాజంలో నయంకాని రాచపుండయి పోయాయి. దీనికారణంగా కుటుంబాలే సమసిపోతున్నాయి, నైతిక మూల్యాలే అంతమయిపోతున్నాయి. శారీరక, మానసిక, నాడీమండల వ్యాధులు వ్యాపిస్తు న్నాయి. ఫలితంగా పాశ్చాత్య సభ్యతా సంస్కృతుల పునాదులు కదలిపోయాయి. ఈ భయంకర ఫలితాలను చూసిన తరువాత కూడా సదాచార ప్రకృతి, ప్రవృత్తి గల ఏ వ్యక్తి అయినా పరదా పద్ధతిని కాదనగలడా, దూషించగలడా, అటువంటి వ్యక్తి పరదా నియమాన్ని తప్పకుండా పాటించాలని నియమబద్ధం చెయ్యాలని వాదిస్తాడు, అవశ్యమని వాదిస్తాడు, ఈ నియమం లేకపోతే దీని కొరకు చట్టం చేయాలని అతని సహజ ప్రకృతియే అతన్ని బలవంతపెడుతుంది, అతను స్త్రీ పురుషులిరువురినీ వాటికి బద్ధులయ్యేలా కృషి చేస్తాడు.

## పరదా ప్రగతికి ప్రతిబంధకమా?

ముస్లిమ్ మహిళల ప్రగతి మార్గంలో పరదా పద్ధతి మహా ప్రతిబంధకమని అంటారు చాలామంది. దీని కారణంగానే ఆమె ఎంతో వెనుకబడిపోయిందని ఇంకా దిగజారిపోతోందని కూడా అంటారు. రాజకీయ, సామాజిక, సాంఘిక జీవితంలో ఆమె ఆచరణాత్మకంగా దూరమయిపోయిందని అంటారు. ఏ స్త్రీలయితే ఈ ప్రతిబంధకం లేకుండా స్వేచ్ఛగా ఉన్నారో వారు ఆశ్చర్య జనక మయిన ప్రగతిని సాధించారని, ఇంకా సాధిస్తూ ఉన్నారని కూడా అంటున్నారు.

ఆ ప్రగతి 'లలిత కళల' పేరుతో జరిగే ప్రగతి అయితే, అందులో నగ్నత్వం, నిర్లజ్జతో కూడిన నృత్యం, సంగీతంతో సాధించిన ప్రగతియే అయితే అందులో నిస్సందేహంగా స్త్రీ బహుధా ఉన్నత సోపానాలు సాధించిన మాట వాస్తవమే, ప్రగతి పేరిట మహోన్నత శిఖరాన చేరిన విషయమూ నిజమే. అయితే దీనికొరకు ఆమె చెల్లించిన మూల్యం ఏది- వ్రీడా, బిడియాలు, మానాభిమానాలు, ప్రేమాను రాగాలు, విధేయత అంకిత భావాలు వంటి ఉన్నత ప్రమాణాలను త్యాగం చెయ్యవలసి వచ్చింది. ఈ విలువల్ని కాలరాయకుండా ఈ 'ప్రగతి' సాధించడం అన్నది సాధ్యపడనే జాలదు. ఈ విషయంలో ఇస్లామ్ ఓ ప్రత్యేక దృక్కోణం సూచిస్తుంది. ఇస్లామ్ దృష్టిలో ప్రగతి అన్నది మానవునిలో ఉన్నత మానవీయ గుణాలను సృజించడం. ఏ ప్రగతి వల్లనయితే ఈ గుణగణాలు కాలరాయ బడతాయో అది దాన్ని ప్రగతిగానే స్వీకరించదు.

అయితే మరో వాస్తవముంది. పై విషయాలను ప్రక్కన పెట్టినప్పటికీ ఆధునిక కాలంలో స్త్రీ విభిన్న శాస్త్రాలలోనూ, కళల్లోనూ ప్రగతి సాధించింది, శాస్త్రీయ, పరిశోధనాత్మక సేవలు అందజేసిందన్నది సత్యం. కాని కొందరు ఓ అపార్థానికి లోనయ్యారు. స్త్రీ పరదా పద్ధతిని అనుసరించినట్లయితే ఈ ప్రగతిని సాధించలేక పోయేది అని భ్రమలకు లోనయిపోతారు. ఈ భ్రమలకు కారణం, అంతటా అలుము కున్న వ్రీడా విహీనమయిన, పరదా విసర్జిత వాతావరణం వల్ల ఉత్పన్నం అవుతుంది. ఈ వాతావరణం వల్ల మనిషి మనసు అనవసరంగా దానికి ప్రభావిత మయి లొంగి పోతుంది, స్త్రీ ఓ పరిశుద్ధ వాతావరణంలో జీవించి ప్రగతి సాధించ గలుగుతుంది అన్న విషయం అసలు మనిషికి బోధపడనేజాలదు. వాస్తవానికి ప్రగతి అన్నది పరదాను విసర్జించిన దాని ఫలితంగా మటుకు ముమ్మాటికీ సాధ్య పడలేదన్నది అతనికి బాగా తెలుసు. ప్రగతికి సాధనాలు వేరు.

ఒకటేమిటంటే, ఏ మహిళలయినా ఏదయినా సాధించగలిగారంటే అది వారి కృషి, శ్రమ, తమ సాధన పట్ల వారి చిత్తశుద్ధి, సంకల్ప శుద్ధి, ఏకాగ్రచిత్తత అన్నవి ఎంతో పని చేశాయి. వారి ఈ మహత్తును గుర్తించడం, కొనియాడటం తప్పనిసరి. మరో విషయం ఏమిటంటే, దేవుని ఓ నియమం ఉంది. ఎవరయినా చిత్తశుద్ధితో, ఏకాగ్ర చిత్తంతో శ్రద్ధగా శ్రమ పడితే వారికి వారి ఈ శ్రమకు తగ్గ ఫలం తప్పక దక్కుతుంది.

రెండవదేమిటంటే నేటి సభ్యత అశ్లీల సభ్యత. ఈ సభ్యతలో జ్ఞానం, కళలలో సౌలభ్యాలు, సౌకర్యాలు, స్థానం స్త్రీలకు లభించాలంటే స్త్రీ తన ముసుగును ఎత్తేసి, సిగ్గులేని వారి వరుసన, వారి సరసన నిలబడవలసిందే. ఈ విధంగా ఆచరణాత్మకంగా తమ తెరచాటు బతుకును కాపాడుకోవాలనుకునే స్త్రీల కొరకు ప్రగతి మార్గాలు మూసివేయబడ్డాయి. వాస్తవానికి ప్రగతి అన్నది ముసుగుతో ముడివడి లేదు, నిజానికి అది స్త్రీకి లభించే సౌలభ్యాలకు సంబంధించిన విషయం. ఈ కాలంలో గడించిన అనుభవం స్వయంగానే చాటుతోంది, ముసుగును పాటించిన మహిళలు సయితం తమకు ప్రాప్తమయిన అవకాశాలను బట్టి వారు ఆ మేరకు ప్రగతిని సాధించారు. ఆ మేరకు ముసుగులేని స్త్రీలకన్నా ఏమాత్రం వెనుకబడిలేరు.

దీనికి భిన్నంగా ఈ హద్దుల్లో ఉంటూ ఒకవైపున వారు జ్ఞాన స్థానంలో అత్యున్నత శిఖరాలనధిరోహించటమేకాక మరో వైపున రాజకీయ, సామాజిక, సాంఘిక, పోకడలను పట్టించుకోకుండానూ ఉండలేదు, పైగా వాటిపైన ప్రభావం వేయ గలిగారు.

ఈ కృషి అంతా ఒక ఎత్తయితే వీరి ఒడిలో ఎదిగిన మణులూ రతనాలూ చరిత్రకే శోభ చేకూర్చాయి. వారు అనేక శాస్త్రాలలో నిపుణులయినవారు, కళాకారులుగా పోషణ పొందారంటే వారి శాస్త్రపరమయిన, సభ్యతా పరమయిన మహోపకారాల రుణం మానవత ఎన్నటికీ తీర్చుకోజాలదు. ఈ మహత్కార్యాలన్నీ అజ్ఞానులయిన మూఢులయిన మహిళల ద్వారా సాధ్యమయిందా?

## హిజాబ్ పరిమితుల చర్చ, తప్పుడు వాదన

ఇస్లామ్ స్త్రీ పురుషుల సంబంధాన్ని ఓ ప్రత్యేక దృక్కోణంలో చూస్తుంది. పరదా వ్యవస్థ అందులో ఒక భాగం. ఆ దృక్కోణం ఆధునిక దృక్కోణంతో పూర్తిగా భిన్నమయింది. అది అడుగడుగునా దాన్ని అడ్డుకుంటుంది.

ఇస్లామ్ ప్రకారం స్త్రీ శ్రద్ధాసక్తుల మూలకేంద్రం ఆమె ఇల్లు. ఎటువంటి అవసరం, అనివార్యతా లేనిదే ఆమె ఇంటి నుండి బయటికి వెడలడాన్ని ఇస్లామ్ సుతరామూ ఇష్టపడదు. కాని నేటి కాలం స్త్రీ ఆచరణా కేంద్రం ఆమె ఇల్లు అవడాన్నే అసలు అంగీకరించదు. ఇస్లామ్ స్త్రీ పురుషుల మిశ్రమ సమాజాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తుంది. దానికి భిన్నంగా ఈ మిశ్రమ సమాజం నేటి సామాజిక వ్యవస్థలో తప్పనిసరి అంశం. ఇస్లామ్ చూపును క్రిందికి వాల్చి ఉంచాలని ఆదేశిస్తుంది. దీనికి భిన్నంగా నేటి ఆలోచనా విధానాల చిట్టా అంతటికీ ఇటువంటి భావన లంటేనే గిట్టదు. పరస్త్రీపై దృష్టి పడినా మనిషి వెంటనే చూపు మరల్చుకుని చూపు నేలకు వ్రాల్చుకోవాలి అని అంటుంది ఇస్లామ్. అదేమిటి...? ఫ్రీగా లభించిన ఓ ఆనందానికి వంచితులవడం! ఇది చాలా హీనమయిన దురభిరుచిగా పరిగణించ బడడం కూడా సాధ్యమే! ఇస్లామ్ విద్య, శిక్షణ, ఆటపాటలు, కాలక్షేపాలు, తదితర క్షేత్రాల స్త్రీ పురుషుల కలయికను వారి నైతికత రీత్యా వినాశకరమని భావిస్తుంది. దీనికి విరుద్ధంగా ఈ వ్యవస్థలన్నీ వీరి ఉభయుల సమ్మిశ్రమంతోటే ఏర్పడ్డాయి, ఇదే దీని ఉత్తమ రూపంగా భావించబడుతుంది కూడా.

ఇస్లామ్ ఆదేశమేమిటంటే స్త్రీలు ఆరాధనల్లో సయితం పరస్పరం వేరుగా ఉండాలన్నది దాని బోధన. దానికి భిన్నంగా ఆధునిక యుగంలో స్త్రీ పట్ల 'వివక్ష వర్తనం' అంగీకరించడం జరగదు. అది రోడ్డు మీద, బజారుల్లో, కార్యాలయాల్లో, సామాజిక, సాంస్కృతిక, సాంఘిక కార్యకలాపాల్లో స్త్రీ పురుషులు భుజంతో భుజం కలిపి ఈడు జోడుగా పనిచేయడాన్ని చూడదలుస్తుంది.

ఆధునిక యుగం స్త్రీకి ఆంక్షారహితమయిన జీవితానికి పిలుపునిస్తుంది. ఇస్లామ్ నైతిక నియమాల పరిధులు హద్దులు ఆమెకు అవసరమని నిర్ణయిస్తుంది. ఉభయ గమ్యాలు కళ్ళెదుటే ఉన్నాయి. స్త్రీ అతి సునాయాసంగా తన మార్గం, తన గమ్యం ఏదో నిర్ణయించుకోగలదు.

స్త్రీ సాధికారతకు ఇస్లామ్ సూచించే సూత్రం ఏమంటే ఇస్లాం స్త్రీ జాతి సహజత్వం సున్నితత్వాలకనుగుణంగానే ఆమెకు సగౌరవ స్థానాన్ని ప్రసాదించింది.

ఏ మానవ జాతి ఉత్థాన ఉద్దీపనలకైనా మొట్టమొదటి షరతు, దాని వ్యక్తిత్వాన్ని

అంగీకరించి, ఆ వ్యక్తిత్వం గుర్తింపుల ప్రాతిపదికనే గౌరవ మర్యాదలు ఇవ్వాలి.

దురదృష్టవశాత్తు సాధికారత పేరిట ఆధునిక పాశ్చాత్య ప్రపంచంలో ఆడవారితో ఇలాగే ఆటాడుకుంటున్నారు. వారి ఆలోచనా ధోరణి ప్రకారం మహిళా సాధికారత కావాలంటే స్త్రీ తన వ్యక్తిత్వాన్ని సహజత్వాన్ని అమ్ముకోవాల్సిందే. వారి భావన ప్రకారం పురుషుల పాత్ర, బాధ్యతలు అనన్యమైనవి. స్త్రీ తన సహజ స్వభావానికి వ్యతిరేకంగా ఆ తరహా పాత్రలనే అవలంబించాలి. పురుషులు ఏ దుస్తులయితే వేసుకుంటారో అవే స్త్రీలు వేసుకోవాలి. వారు ఎలా ఉంటారో వీరు కూడా అలాగే మసలుకోవాలి. పురుషుల కామవాంఛలు తీర్చే విధంగా ముస్తాబవుతూ, వారి సరదాలకై అందాల పోటీల్లో పాల్గొంటూ, స్విమ్ సూట్ క్యాలెండర్‌లకు ఫోజులివ్వాలి. స్త్రీ సహజ స్వభావాలను అణచివేసి పురుషుల అసహజ ప్రదర్శనలు చేయాలి. తన స్వభావానికి సాధ్యమైనంత మేరకు స్వస్తి పలికి, పురుష స్వభావాలను స్వాగతిస్తూ, వారి కామ తృష్ణను తీర్చే కన్యలుగా మారినప్పుడే ఆధునిక మహిళగా ఆమె అంగీకరించబడుతుంది.

దానికి భిన్నంగా ఇస్లాం మహిళను ఆమె సున్నిత స్వభావాలు, సహజత్వాలు, బలాలు, బలహీనతలు ప్రకృతి స్వభావానికనుగుణంగానే అంగీకరిస్తుంది. ఆమె సామర్థ్యాల రీత్యానే ఆమెకు గౌరవ మర్యాదలు ప్రసాదించింది. ఇక్కడ స్త్రీ పురుషుడికి లోబడి ఎంతమాత్రం లేదు. ఆమె వ్యక్తిత్వం వివాహం ఇతరత్రా మార్గాల ద్వారా పురుషుడి వ్యక్తిత్వంలో ఇమిడిపోయి కలగాపులగం అయ్యే అవకాశం లేదు. తన శక్తియుక్తులను సాధించు కునేందుకు పురుషుడిగా మారి, వారి కామ తృష్ణను తీర్చే కృత్రిమ యంత్రంగా మారే అవసరం అంతకంటే లేదు. ఆమె మహిళగా ఉంటూనే గౌరవప్రదమైన పద్ధతిలో తన హక్కులను సాధించు కోగలదు. ఇక్కడ **స్త్రీ శక్తియుక్తుల రహస్యాలు ఆమె అసహజ పురుషత్వ ధోరణిలో ఎంతమాత్రం దాగి లేవు. స్త్రీత్వానికి కూడా అపారమైన ఆదరాభిమానాలు ప్రాధాన్యతలు ఉన్నాయి. "తల్లి పాదాల చెంత స్వర్గం ఉంది". "సుగుణవతి అయిన సతి అదృష్టం, సౌభాగ్యానికి సంకేతం". ఆడపిల్లలు స్వర్గసీమలు, భార్య తల్లి చెల్లి కూతుళ్లు కేవలం స్త్రీలు మాత్రమే కాదు, స్త్రీ పాత్రలు పోషించే అపురూపమైన పేర్లకు ప్రతిరూపాలు కూడా.**

షహీద్ లీమా అల్ ఫారూఖీ ఈ విషయంపై మాట్లాడుతూ ఓ విషయాన్ని ప్రస్తావించారు:

Equality and Identity are two different things. Islamic traditions maintain the former desirable the latter not.

"సమానత్వం, గుర్తింపు రెండూ వేర్వేరు విషయాలు. (స్త్రీ పురుషుల విషయంలో) ఇస్లాం మొదటి విషయాన్ని అభిలషిస్తుంది, రెండవ దానికి వ్యతిరేకం".

ఇంకొంచెం ముందుకు వెళ్ళి ఆమె ఇలా రాశారు:

**"పాశ్చాత్య స్త్రీవాదం మహిళల సమానత్వం పేరిట హక్కులను సాధించుకునేందుకు ఏకలింగ సమాజం వైపు అడుగులు వేస్తోంది. ఏకలింగ సమాజం అంటే అక్కడ ఒకే విధమైన పాత్రలు అభిరుచులకు ఉభయ లింగాల నుండి గౌరవ ప్రాధాన్యతలు లభిస్తాయి. ఇక సమాజమంతా లింగ భేదం లేకుండా గుడ్డిగా దాని వెనకే పరిగెడుతుంది. పాశ్చాత్య స్త్రీవాదం పురుషుల పాత్రలకే పట్టం కట్టింది. అక్కడ ఆర్థిక రంగం, భావి బాటలు, మహిళల గుర్తింపు తదితర పాత్రలకు అపూర్వమైన ఆదరాభిమానాలు లభించగా పిల్లల పెంపకం, గృహ నిర్వహణ, సామాజిక సంబంధ బాంధవ్యాలు, కుటుంబ పటిష్టత, శారీరక మానసిక సంతృప్తి, భావోద్వేగాలను బలపరిచే భావాలు విలువలను విస్మరించి, వాటిని అల్ప విషయాలుగా భావించడం జరిగింది."**

ఆధునిక పాశ్చాత్య భావాలతో పోల్చుకుంటే ఇస్లాంలో స్త్రీ సాధికారతకు సానుకూల దృక్పథం ఉంది. ఇస్లాం స్త్రీని ప్రకృతి పరిధిలో ఉంచుతూనే ఆమెకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, సర్వాధికారాలను ప్రసాదించింది. విద్యాజ్ఞానాలే శక్తియుక్తుల ప్రధాన కేంద్రాలు. విద్యనభ్యసించే విషయంలో ఇస్లాం స్త్రీ పురుషుల మధ్య ఎటువంటి వ్యత్యాసాన్ని చూపలేదు. చరిత్రపుటల్లో హజ్రత్ అలీ(రజి) పలుకులు ఎప్పటికీ సువర్ణాక్షరాలుగా మిగిలి ఉంటాయి. "ఒక అబ్బాయికి విద్యా జ్ఞానాలను అందిస్తే ఒక వ్యక్తికి విద్యనందించడంతో సమానం. కానీ ఒక అమ్మాయికి, ఆడ పిల్లకు విద్యనందిస్తే యావత్ జాతికి విద్యనందించినట్లే". మహాప్రవక్త(స) విద్యలో సగభాగాన్ని ఆయిషా(రజి)కు అందించి ఆధునిక పాశ్చాత్య ప్రపంచానికి ఎన్నో శతాబ్దాలకు ముందే స్త్రీ స్థానాన్ని పతాకస్థాయికి చేర్చి చూపారు.

అదేవిధంగా ఇస్లాం స్త్రీకి ఆర్థిక స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు కూడా ప్రసాదిం చింది. ఆర్థిక జీవితంలో ఆమె భర్తకు లోబడాల్సిన అవసరం ఎంతమాత్రం లేదు. ఇస్లాం కుటుంబ జీవితానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చినప్పటికీ ఓ చిన్న కుటుంబంలో కూడా ఉమ్మడి ఆర్థికాభివృద్ధికి ఎలాంటి స్థానం లేదు. స్త్రీపురుషుల ఆర్థిక బాధ్యతలు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల విషయంలో, జకాత్ తదితర ధార్మిక విధి విధానాలు స్త్రీ పురుషులు కుటుంబ వ్యక్తులకు వేర్వేరుగానే వర్తిస్తాయి. దానికి భిన్నంగా ఆధునిక సమాజాలలో విధించే పన్ను మాత్రం కుటుంబాలకు (Family Income) వర్తిస్తుంది. భార్యాభర్తలు, కుటుంబ వ్యక్తుల ఆస్తిపాస్తులు వేర్వేరుగా ఉన్నప్పుడే ఇస్లాం ఆదేశాల ప్రకారం వారసత్వ పంపకాల అమలు సాధ్యమవు తుంది. అటువంటప్పుడు ఒక ముస్లిం కుటుంబంలో భార్యాభర్తల జాయింట్ అకౌంట్ల భావన కూడా సరికాదు. భార్య పోషణా బాధ్యతలు భర్తపై ఉన్నాయి కనుక భార్య ఆదాయం, ఆమె ఆర్థిక వనరులు, గిఫ్ట్ లేక వారసత్వ పంపకాల్లో లభించిన ఆస్తులపై భర్తకు ఎటువంటి హక్కు ఉండదు. ఎవరి ప్రమేయం లేకుండా స్వతహాగా ఆమె ఆస్తిని వాడుకునే సర్వ హక్కుభుక్తములు ఆమెకు ఉంటాయి.

ఇస్లాంలో పురుషులకు మాదిరిగానే స్త్రీకి భావప్రకటనా హక్కు ఉంది. ఆమె తన హక్కును పూర్తిగా వినియోగించుకోగలదు. హజ్రత్ ఉమర్ (రజి) తర్వాత హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ ప్రభుత్వ ఏర్పాటు కొరకు ప్రజాభిప్రాయ సేకరణ చేసినప్పుడు స్త్రీలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆమెకు ప్రభుత్వ వ్యవహారాలలో తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచే హక్కే కాదు, ప్రజా పాలకులను నిలదీసే హక్కూ ఉంది. మహ్ర్ విషయంలో హజ్రత్ ఉమర్ తీసుకున్న నిర్ణయంపై ఒక మహిళ ప్రజల ముందు బహిరంగంగానే ఆయనను నిలదీయడంతో ఆమె మాటతో ఏకీభవించి హజ్రత్ ఉమర్ తన ఆదేశాన్ని వెనక్కి తీసుకున్నారు. ఇది ఇస్లామీయ చరిత్రలో జరిగిన చరిత్రాత్మక సంఘటన.

# స్త్రీ తన హక్కుల సాధన కోసం పోరాటం చేయవచ్చు

తన ఇంటినీ కుటుంబాన్ని చక్కదిద్దడమే స్త్రీల సిసలైన బాధ్యత అయినప్పటికీ సామాజిక వ్యవహారాలలో ఆమె పాత్ర కాదనలేనిది. సమాజ సంస్కరణ బాధ్యత కూడా ఆమెపై ఉంది. కనుకనే ఇస్లాం మంచిని ఆజ్ఞాపించే, చెడును నివారించే ధర్మ సందేశ బాధ్యతలు కూడా ఆమెపై మోపింది.

దివ్యఖుర్ఆన్‌లోని సూరె తౌబాలో ఈ విధంగా ప్రస్తావించబడింది:

**విశ్వసించిన స్త్రీ పురుషులంతా ఒకరికొకరు స్నేహితులు, శ్రేయోభిలాషులు. వారు ప్రజలకు మంచి విషయాలు బోధిస్తారు. చెడు విషయాలనుండి వారిస్తారు. నమాజ్‌ను స్థాపిస్తారు. పేదల హక్కు జకాత్ ఇస్తారు. దేవుని పట్ల ఆయన ప్రవక్త పట్ల వినయ విధేయతలతో ఉంటారు. వీరి పైనే దైవకారుణ్యం వర్షించేది. దేవుడు సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడు". (తౌబా:71)**

ఇస్లాం సూచించే మహిళా సాధికారతకు మరో విశిష్టత ఏమంటే, ఇస్లాం స్త్రీకి తన సహజ పాత్రలను పోషించేందుకు స్ఫూర్తి నిస్తుంది. వాటి కొరకు ఆమెకు తగిన శక్తియుక్తులు, సందర్భాలు సౌలభ్యాలు కలుగజేసింది. ఆర్థిక బాధ్యతలు ఆమె పాత్రకు ఆటంకంగా ఉంటాయన్న చింత లేకుండా చేసింది. ఆర్థిక బాధ్యతలు లేకుండానే ఆర్థిక స్వేచ్ఛను ప్రకటించింది. ఆమె పోషణా బాధ్యతలు భర్త పరం చేసింది. ఆమె సంపన్నురాలైనప్పటికీ పోషణా బాధ్యత మాత్రం భర్తపైనే ఉంటుంది. కుటుంబం లాంటి పటిష్ట సంస్థ ద్వారా ఆమెకు రక్షణ కల్పించింది. 'హిజాబ్' ద్వారా ఆమెకు గౌరవ ప్రతిష్టలు, సామాజిక రక్షణనిచ్చింది. స్త్రీ సహజ పాత్రలను ఆటంకపరిచే, అదనపు భారమయ్యే అన్ని బాధ్యతల నుండి ఆమెకు మినహాయింపును ఇచ్చింది.

ఈ విధంగా మహిళా సాధికారత విషయంలో పాశ్చాత్య భావనలకు భిన్నంగా ఇస్లాం దృక్పథం స్త్రీ జాతికి సంపూర్ణంగా, సహజసిద్ధమైన విధంగా ఉంది. ఇందులో ఎటువంటి అసంతులనం లేదు. ఇక్కడ సాధికారత కోసం స్త్రీ తన సహజత్వాన్ని కోల్పోయే సమస్య లేదు. తన స్త్రీత్వాన్ని పణంగా పెట్టే అవసరం అంతకంటే లేదు.

పాశ్చాత్య సమాజాలలో స్త్రీ తనదైన గుర్తింపును సాధించుకున్నా, వ్యక్తిగతంగా మాత్రం ఆమెకు ఎలాంటి మేలు జరిగే అవకాశం లేదు. అక్కడ ఆమె తన సహజత్వాన్ని కోల్పోవడమేకాక సామాజికంగానూ తన ప్రాభవాన్ని కోల్పోతోంది. పిల్లల శిక్షణ, పెంపకం, కుటుంబ క్రమశిక్షణ, గృహస్థ జీవితాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయి. ఇటువంటి పరిణామాలు ఏ ఆరోగ్యవంతమైన సమాజానికి కూడా శుభ సంకేతాలు కావు. ఇంటిని చక్కబెట్టే ఇల్లాలే లేకపోతే ఆ గృహాలు గృహ సీమలుగా ఎలా మారుతాయి? పర్యవసానంగా కుటుంబాలు కూలిపోతాయి. నేడు పాశ్చాత్య ప్రపంచంలో జరుగుతుంది ఇదే. అక్కడ స్త్రీల సహజ పాత్రలు పూర్తిగా పతనమైపోయాయి.

*("ఇస్లామీయ ఉద్యమం మహిళలు' పుస్తకం నుండి)*




# ఇస్లామ్‌లో...

★ మహిళల హక్కులేమిటి?

★ భార్యగా ఆమెను ఎలా చూసుకోవాలి?

★ తల్లిగా ఆమెను ఎలా ఆదరించాలి?

★ ఆడబిడ్డకు ఆస్తిలో వాటా ఎంత?

★ పరదా ప్రగతికి ప్రతిబంధకమా?

★ తలాక్ ఎప్పుడు? ఎందుకు?

# స్త్రీలకు స్వేచ్ఛ లేదా?

ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు కావాలంటే ఈ పుస్తకాలు చదవాల్సిందే..

మరింకెందుకు ఆలస్యం ఈ రోజే ఈ పుస్తకాలను ఆర్డర్ చేయండి.

**నేరుగా మీ ఇంటికే పంపుతాము.**

పోస్టల్ చార్జీలు ఉచితం

**TELUGU ISLAMIC PUBLICATIONS TRUST** (Regd.) Chatta Bazar,yd Herabad-500 002.

For Online Payment | Bank Details:TELUGU ISLAMIC PUBLICATIONS TRUST

Central Bank of India, Noorkhan Bazar Branch, HyderabadA/c. No. 1042789779 IFSC Code. CBIN0282407

మరిన్ని వివరాలకు సంప్రదించండి: 9490627650 7660012481

# ఇస్లామ్ సమాచార కేంద్రము
# ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్ (ఐఐసి)

IIC
Discover Islam
Explore, Don't Ignore

www.iichyderabad.org

# Islamic Information Center

ఇస్లామ్ ధర్మానికి సంబంధించిన సమాచారం, అపోహలు, అపార్థాలను దూరం చేయడం కోసం ఏర్పాటు చేయబడిన మొట్టమొదటి ఇస్లామిక్ కాల్ సెంటర్.

తెలుగు, హిందీ, ఇంగ్లీష్, తమిళం, కన్నడ, మరాఠి, బెంగాలీ భాషలలో మీ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు....

ముస్లిమ్ మహిళలు పరదా ఎందుకు ధరిస్తారు?
రమజాన్ నెలలో ఎందుకు ఉపవాసం ఉంటారు?
వడ్డీ, మద్యపానం, జూదం ఇస్లామ్‌లో ఎందుకు నిషేధం?

ఇలా ఎన్నో.... సందేహాల సమాధానాల కోసం
ఈ రోజే మా కాల్ సెంటర్‌కు ఉచితంగా ఫోన్ చేయండి.

టోల్ ఫ్రీ



**1800 572 3000**



________oo________

ఉదయం 8 గంటల నుండి
రాత్రి 12 గంటల వరకు
మా కాల్ సెంటర్ పని చేస్తుంది.

మీ మొబైల్ ఫోన్ నుండి లేదా ల్యాండ్ లైన్ నుండి మా టోల్ ఫ్రీ నెంబర్ **1800 572 3000**కు ఉచితంగా ఫోన్ చేసి మీ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. ఇస్లామ్ కు సంబంధించిన సరైన పరిజ్ఞానాన్ని పొందవచ్చు.

Toll Free **1800 572 3000**